కథా నిలయం
3875
శ్రీకాకుళం

# అమాయకురాలు

సన్నజాజి పూలు తలలో పెట్టుకొని సన్నగా కూనిరాగం తీసుకుంటూ ఒక చోట కూలబడింది కమల. ఇంతలో వంటింట్లో నుంచి అమ్మ కేకేసింది. పరుగెత్తుకుంటూ ఒక్క క్షణం వంటింటి గుమ్మం దగ్గరకు చేరుకుంది.

'ఏమిటే అట్లా నించున్నావ్? అవతల పిన్నిగారు పిలుస్తున్నారు. వినపట్టంలా? అంది అమ్మ.

'ఎవరూ? పిన్నిగారా-వినపళ్ళే, అమ్మా. వెళ్ళివస్తానుండు' అంటూనే కమల పక్కవాటాలోకి పరుగు తీసింది.

'పిన్నిగారూ. పిలిచారా?' అంది.

రాధమ్మగారు జడ వేసుకుంటోంది.

'అవునే ఏమీ తోచక యేంచేస్తున్నావో, చూదామని పిలిచాను-కూచో' అంది పిన్నిగారు.

కమల కూచుంది.

'నేనూ యిప్పుడే జడ వేసుకున్నాను పిన్నిగారూ. ఇంట్లోనే కూచుని యేంచేదామా అని ఆలోచిస్తున్నాను. ఇంతలో మీరు పిలుస్తున్నారని అమ్మ చెప్పింది. వంటయిందా పిన్నిగారూ?' అంది.

'ఆ. అయిందే, ఇంక చీకటి పడడమే తరువాయి. మీ బాబాయిగారు రావడంతోటే-యింత తినడమూ, నిద్దరోవడమూను' అంది రాధమ్మగారు. కమల మెల్లిగా నవ్వింది.

'అవునుగాని, కమలా, మొన్నవచ్చిన గుంటూరు సంబంధం యేమయిందే-'

కమల సిగ్గుగా తలవంచింది. 'పోండి, పిన్నిగారూ. నాకు తెలీదు' అంది.

'యేం నంగనాచివే. కట్నం దగ్గరే ఇంకా మాటలు నడుస్తున్నాయని మీ అమ్మగారు చెప్పార్లే' అంది రాధమ్మపిన్నిగారు, జడ వేసుకోవడం పూర్తి చేసుకుంటూ.

'మరి తెలిసే అడుగుతారేం ?' పెంకెగా కొంటెగా అంది కమల.

'అబ్బాయి నీకునచ్చాట్టే కమలా?'

'మీరట్లా మాట్లాడితే నే వెళ్ళిపోతా బాబూ' అంటూ కమల లేచింది.

'ఓసి నీ సిగ్గు సిగతిరగ! కూచోవే యేంవేషాలు వేస్తావుగాని' అని రాధమ్మపిన్నిగారు కమలను బుజంపట్టుకు కూర్చోబెట్టారు.

'మరి మీ రట్లాంటి మాటలంటే-'

'ఏమన్నానే మరీచోద్యం, పోనీలే. నీకంత యిష్టంలేకపోతే అలాగే మానివేస్తాను. నీ మొగుణ్ణి గురించి నాకెందుకు ఊసు'.

కమల యేం మాట్లాళ్ళేదు.

రాధమ్మగారే మళ్ళీ 'యేమే నీకు డాక్టర్ కావాలా, ప్లీడర్ కావాలా-కోరుకో,' అంది,

కమల-ముందు జవాబు చెప్పగూడ దనుకుంది. కాని కొంటెదనం చూపుదామని 'యాక్టర్ కావాలి' అంది.

'పిడుగా! మగవాళ్ళందరూ యాక్టర్లేనే' అంది రాధమ్మగారు కమల బుగ్గ పొడుస్తూ.

'లేకపోతే ఏమిటి పిన్నిగారూ, మీరుకూడా !'

'అయితే పిల్లవాడు అంత ఎర్రగా లేడుకదా-'.

కమల యీమారు చెప్పకుండానే పరుగెత్తుకు పోదామనుకుంది. ఈ సంగతి ముందుగానే గ్రహించిన రాధమ్మగారు మటుకు ఆ ప్రయత్నం పడనీయలేదు.

'పోనీలే. నీ మొగుణ్ణిగురించి నీలో నీవే ఆలోచించుకో. నాకు చెప్పక్కర్లేదులే-' అంది ఆమె.

కమల మరింత సిగ్గుతో ముఖం కిందికి దించుకుంది. ఒక్కసారి కళ్ళు మూసుకుని అంతర్గతంగా చూచుకుంది. మొన్న పెళ్ళిచూపులకు వచ్చిన సుందర్రావు కళ్ళల్లో మెదిలాడు.

కమల ఆశ్చర్యపోయి కళ్లుతెరిచి చూసింది. రాధమ్మ పిన్నిగారు జడ వేసుకోవడం పూర్తిచేసి రిబ్బను చుట్టుకుంటుంది. తనవేపే చూస్తోంది. లోతుగాచూస్తున్న ఆమెకళ్ళల్లోకి చూస్తుంటే యెందుకో కమలకు భయం వేసింది.

'యేమిటి పిన్నిగారూ, అట్లా చూస్తున్నారు?' అంది. ఆమెగారు మెత్తగా నవ్వింది.

'నీ చేష్టలు చూస్తుంటే నవ్వుగాక యింకేం వస్తుంది?' కమలకు అర్థం కాలేదు. తనేం అనుచితంగా ప్రవర్తించడం లేదే-అనుకుంది.

ఏం మాట్లాడాలో తెలియకుండా పోయింది. ఇంతలో పిన్నిగారే మళ్ళా 'కమలా, నిజంచెప్పు-' అంది.

'ఏమిటండి?' అంది కమల, ఒక్కసారిగా ఉలిక్కిపడి.

'నీకు డాక్టర్ నే చేసుకుందామని ఉందా?'

సుందర్రావు యం. బి. బి యస్. ఫైనలియ్యర్ చదువుతున్నాడు. అమ్మాయి యీ కుర్రవాడంటేనే కాస్త తలఊపు తున్నట్లు వున్నదని కమల అమ్మగారు ఆమెతో చెప్పారు.

'పిన్నిగారూ, మీరు పెళ్లిగొడవ మాట్లాట్టం మానెయ్యకపోతే నేను మీతో మాట్లాట్టం మానేస్తాను-' అంది కమల కాస్త సీరియస్‌గా ముఖం పెట్టి.

రాధమ్మగారు నవ్వింది. 'ఎన్నాళ్ళు మానేస్తావులే. ఆ మూడుముళ్ళు పడేవరకేగా. తరవాత ఎవరికోసం మాట్లాడిస్తావు' అంది.

పిన్నిగారు పెళ్ళి ప్రస్తావన మానివేయదని కమలకు రూఢి అయింది తక్షణమే అక్కడినుంచి లేచిపోదా మనుకుంది. కాని అట్లా లేచిపోతే

యేమన్నా బాగుంటుందా? పిన్నిగారు యేమన్నా అనుకోరూ? - అనుకుంది. అయితే కూర్చున్నకొద్దీ ఆమె పెళ్ళిగొడవలే అడుగుతారు. అప్పుడు యింకేంచేసేట్టు? ఆమెగారిని కాస్త యీదారి తప్పించి మాటాడిస్తే?

ఆ మాట చెప్పడంకోసం ఎంతోకాలంగా వేచివున్నట్లు 'పిన్నిగారూ, మొన్నను సినిమాకు వెళ్లాం చూచారూ, అందులో యిద్దరు కొత్తయాక్టర్లు వున్నారండీ' అంది.

'కొంపదీసి నువ్వా యాక్టర్లనిగాని ప్రేమించలేదు గద!' అంది పిన్నిగారు.

మళ్ళీ కథ మొదటికి వచ్చింది - అనుకుంది కమల. 'ఛీ, ఆడ ఆక్టర్లండీ!' అంది సిగ్గుగా.

'ఆడ ఆక్టర్లు వుండరు కమలా! వాళ్ళు యాక్ట్రెస్సులు అయిపోతారు' అంది పిన్నిగారు, కాంపోజిషను పుస్తకాలు దిద్దే ధోరణిలో.

'ఇంట్లో అమ్మ పిలుస్తూన్నట్లున్నదండి. ఎందుకో కనుక్కువస్తాను' అంది కమల. పిన్నిగారు తల ఊపింది. కమల ఒక్క ఉరుకులో యింట్లో వచ్చి పడింది. అమ్మయ్య-గండం గడిచింది-అనుకుంది. కాని ఈ గండం యింకా ఎన్నాళ్ళు గడవాలి? పిన్నిగారు చెప్పినట్టు ఆ మూడు ముళ్ళు పడేదాకా యిది తనకు దిన దిన గండమే అయ్యేట్టుంది.

ఆ మూడుముళ్ళు యెంత తొందరగా పడతాయి- అనుకుంది కమల. డాక్టర్ సుందర్రావ్-తన మెళ్ళో మంగళసూత్రం కట్టేస్తే యింక పక్కింటి పిన్నిగారు తనతో వేళాకోళాలు, ఎకసక్కాలు చెయ్యటానికి లేదు. అప్పుడే తను డాక్టర్ సుందర్రావ్ అనుకుంటోంది-మనసులో. ఇంకా ఆ అబ్బాయి (?) ఫైనలియరేగా చదువుతున్నాడు. ఇంకా పరీక్షకేనా కూర్చోలేదు. పరీక్షకు కూర్చోవాలి. పేపర్లన్నీ బాగారాయాలి. ఫస్టుక్లాసులో ప్యాసు కావాలి. అప్పుడు తన వూళ్లో—పల్లెటూళ్ళోనేనా? —ప్రాక్టీసు పెడితే తన్ను జనం

అందరూ డాక్టర్ సుందర్రావ్ భార్య అంటారు! అబ్బ తల్చుకుంటేనే యింత మధురంగా వుంది—రేపు...రేపు...పిన్నిగారు చెప్పినట్లు ఆ మూడు ముళ్ళుపడితే తను డాక్టర్ సుందర్రావు భార్య అయితే యింకెంత ఆనందంగా హాయిగా వుంటుందితనకు. ఓహ్! మనస్సు యెక్కడో గాలిలో తేలిపోతున్నట్లు వుంది. ఆ సంతోషంలో కమల ఒకసారి కళ్ళుమూసుకు తన్మయత్వం అనుభవించింది. కళ్ళు ఇలా రెప్ప వాల్చిందో లేదో ఆ సుందర్రావు ప్రతిమ అచ్చుగుద్దినట్లు కనిపించింది, వెడల్పాటి నుదురు; ఉంగరాల జుత్తు; కొనదేలిన ముక్కు; చిన్నగడ్డం అచ్చంగా సుకుమారంగా వుంది. కళ్ళలో చురుకుతనం, చిలిపితనం, చలాకీతనం తొంగి చూస్తున్నాయి. అబ్బ! ఎన్నిసార్లు తల్చుకున్నా తను ఓరకంటితో రెండుసార్లు తొంగి చూచిన రూపమే కన్పిస్తోంది. సుందర్రావు నిజంగా సుందరుడే! ఇంత వరకూ వచ్చిన పెళ్ళికొడుకులందరూ ఒకెత్తూ-యితనో ఎత్తు అనిపించింది. మొట్టమొదటి సారి చూచినప్పడే. ఆవిషయం-రెండోమారు చూచినప్పడు ధ్రువపడిపోయింది కూడా! అందుకనే సుందర్రావంటే తను ఉత్సాహం, హుషారు పడుతోంది. మనిషిలో ఆ చలాకీతనం, హుషారుచూచి. అంతే గాని వాళ్ల ఆస్తి. అతని యం. బి. బి. యస్. చూచి కాదు. అవన్నీ తనకేం అవుతై?

పిన్నిగారు తనని ఉడికించటానికి చూస్తోంది. తను సుందర్రావంటే యిష్టపడ్డట్టు అమ్మ చెప్పిందట. అమ్మకుమటుకు తను చెప్పిందా? అమ్మే గ్రహించింది. అంతే, చూపులు అయిపోయిం తర్వాత 'ఏమే, ఏమంటావు' అంది తనని లోపలికి తీసుకువెళ్ళి.

ప్రతిసారీ యిది మామూలే. తను గిరుక్కున తల వెనక్కు తిప్పకొని తనగదిలోనికి వెళ్లి ముసుగు బిగించుకుని పడుకోవడం మామూలే. కాని యీసారి అలా చేయగలిగిందా? ఎలా చేస్తుంది? ఆ విగ్రహం తన కళ్ళల్లో—కనుపాపల్లో—స్పష్టంగా మెదులుతూ వుంటే. మెల్లగా నవ్వి

యింకా ఆ నవ్వు పూర్తికాకుండానే అమ్మ వొళ్ళో వాలిపోయి ముఖాన్ని కడుపులో దాచుకుంది. ఎందుకలా చేసింది తను? ఏమో తనకేం తెలుసు? అయినా యిప్పుడెట్లా తెలుస్తుంది? అప్పుడే ఈ ప్రశ్న వేసుకుంటే పోనీ తెలిసేదేమో! తెలిస్తేనేం, తెలియకపోతేనేం—జరిగిందిది! 'పిచ్చిపిల్లా, వెళ్ళి నీ గదిలో కూచో' అంది అమ్మ. వెనకనే కాఫీగ్లాసు పట్టుకువచ్చి చేతికిచ్చి తను నాన్నగారి దగ్గరకు వెళ్ళింది. నాన్నగారితో తనకు కొద్దిగా వినపడేటట్లు 'అమ్మాయికి నచ్చినట్లు వుంది' అని చెప్పింది. ఇదివరకంతా యేం అనేది? 'ఏమో దానికి నచ్చినట్లు లేదు. అయినా నాకే ఆ అబ్బాయి అదో రకంగా కనిపించాడు' అనేది కాదూ?

అప్పుడే అనుకుంది తను, ఈ సంబంధం తప్పకుండా నిశ్చయించేస్తారని.

చూచుకోవడం అయింది-ఊరికి వెళ్ళి యే సంగతి ఉత్తరం వ్రాస్తామన్నారు.

ఊరికే అనడమేనా? మూడోనాటికల్లా వ్రాయనే వ్రాశారు. "పిల్ల నచ్చింది. కట్నం కానుకల విషయం మాట్లాడుకోవడానికి రావలసింది" అంటూ ఉత్తరం రానేవచ్చింది.

"ఆ! నచ్చకేం చేస్తుంది—రత్నంలాటి పిల్ల—" అంది పిన్నిగారు బుగ్గలు నిమురుతూ. ఏమిటి ఆమెగారు తనని చిన్నపిల్లలా లాలిస్తుంది —అనిపించింది అప్పుడు. బుగ్గలు ఎరుపెక్కినాయి. సిగ్గు ముంచుకొచ్చింది. తుర్రున తన గదిలోకి పరుగెత్తి అద్దంలో ముఖం చూచుకుని పక్కమీద వాలిపోయింది.

ఎలాగయితేనేం పిన్నిగారి దగ్గర్నుంచీ తప్పించుకు వచ్చి తన ఆలోచనల్లో కూరుకుపోయింది-కమల. అద్దం ముందు కూచుంది. అద్దంలో తన బొమ్మ కనిపిస్తోంది. కాస్త గట్టిగా చూస్తే ఆ సుందర్రావు బొమ్మే కనిపించసాగింది. మరికాస్త నిదానించి చూస్తే రెండూ కనిపించాయి. ఏమిటీ

చిత్రం! కమలకు సంతోషం, ఆనందం అన్నీ వెల్లువగా వచ్చినాయి. ఉక్కిరిబిక్కిరి అయిపోతోంది!

అబ్బ! అందరూ తనవేపు కొంటెగా చూట్టమే. ఈ నాలుగురోజులు కాస్త ఎటూ వెళ్ళకుండా తన గదిలోనే తలవంచుకు కూర్చుంటే, ఆ తరువాత యింక తన్నిగురించి ఎవరికీ పట్టదు. తను శ్రీమతి సుందరరావు అయినాక తన్ను ఎవరూ వుడికించలేరు. ముఖ్యంగా రాధమ్మ పిన్నిగారు.

కమల యిలా ఆలోచనల్లో ఊగుతోంది.

రాధమ్మ పిన్నిగారు 'ఏమండీ! అక్కయ్యగారూ! ఏం చేస్తున్నారు?' అంటూ లోపలికి వచ్చింది. కమల తల్లి 'రండి, రండి, కూర్చోండి' అంటోంది.

కమలకు తన గదిలోంచి వాళ్ల మాటలన్నీ వినబడుతూనేవున్నై.

'అయితే—అమ్మాయి పెళ్ళి విషయం యేం తేల్చారు. వాళ్లేమైనా దిగి వచ్చారా లేదా?' అంది పిన్నిగారు.

'లాంఛనాలన్నా తగ్గించుకుంటాంగాని కట్నం పదివేలకు తక్కువయితే లాభం లేదన్నారట రాధా!'

'మరి మీ రేమన్నారు?'

'ఆయనగారు ఎంత యం.బి.బి.యస్. అయితే మటుకు, పదివేలు కట్నం ధారపోసే తాహత్తు మాకెక్కడుంది? పిల్ల నచ్చడం ప్రధానం అని ముందు అన్నారుగదా అని చెప్పి చూపులకు తీసుకువచ్చాం' అంటోంది అమ్మ.

'అయితే ఆ సంబంధం వొదులుకున్నట్లేనా?'

'అబ్బాయికి పిల్ల నచ్చిందట. అందుకని కట్నం కూడా అడిగిన ప్రకారమే యిచ్చేయమని అంటున్నారు.'

'పిల్ల నచ్చినప్పుడు కట్నం విషయం యింత పట్టింపెందు కమ్మా వాళ్లకు?'

'నచ్చడమేమో పిల్లవాడి ప్రమేయంట! కట్నం తండ్రిగారికి! యిద్దరిలో ఎవరి నిర్ణయం మిగుల్తుంది?'

'నచ్చిన సంబంధం వాళ్ళుమటుకు వొదులుకుంటారా? అయినా, మీరు ఎంతవరకు వెళ్లారు?'

'వీరేమో అయిదువేలకంటె రాగిదమ్మిడీ నాచేతగాదని ముందునించే పాట పాడుతున్నారుగా రాధా! అంతకంటే యింకేం లేదు.'

'అయితే నిక్షేపంలాంటి సంబంధం వొదులుకుంటారా అక్కయ్య గారూ!'

'అంతకంటే మరి దారేముంది? పిల్లకి పిల్లవాడు నచ్చాడు. పిల్ల వానికి పిల్ల నచ్చింది. కానయితే కట్నం అంకె ఉభయత్రా నచ్చలేదు.'

'పాపం కమల ఈ అబ్బాయంటే అధిక మోజుపడిందని చెప్పారుగా! ఎంత బాధపడుతుందో!'

'కలిసిరానిదానికి బాధపడి మటుకు ఏం ప్రయోజనం రాధా! అయినా వెర్రిపిల్ల, దానికేం తెలుసు? అంతకంటే అందగాళ్లను చూపిస్తే మరింత మురిసిపోతుంది. వాళ్ల నాన్నగారు అప్పుడే మరో రెండుమూడు సంబంధాలు వాకబు చేస్తున్నారు' అంది కమల తల్లి.

కమల భయం భయంగా కళ్లు మూసుకుంది. చిత్రం! సుందర్రావ్ బొమ్మ కనబళ్లేదు. ఎవరి బొమ్మా కనబళ్లేదు. అంతా కాళీగా వుంది. నల్లగా ఎప్పటిలాగే వుంది. అనుమానం వేసి కళ్ళు తెరచి అద్దంలో చూచుకుంది. ఆక్కడా అంతే! తన బొమ్మే కన్పించింది, మరింకేం కనబళ్లేదు. •

(కృష్ణాపత్రిక / ఆంధ్ర సచిత్ర వారపత్రిక)